


చాలకాలం క్రిందట శాంతినగరం అనే పట్టణాన్ని శాంతసింహుడు, అనేరాజు పరిపాలిస్తుండేవాడు. అతని భార్య శాంతిమతీ దేవి అన్నివిధాలా రాజుకుతగ్గ రాణీని అనిపించుకున్నది. వారు తమ ప్రజలను ఎంతో దయతో చూచుకుంటూ, వాళ్ల కష్టసుఖాలు ఎప్పటి కప్పుడు తెలుసుకుంటూ, తమ పట్టణం పేరు, తమ పేరు సార్థకం చేసుకున్నారు. వీరికి ఒక్కగా నొక్కడే కొడుకు, ధీరవర్ముడు.

శాంతసింహుడు ఉన్నట్లుండి పాపం, అకస్మాత్తుగ మరణించాడు. తండ్రి మరణించేసరికి ధీరవర్ముడికి నిండా ఆరేండ్లయినానిండలేదు. అందుచేత అతని మేనమామ అయిన దుష్టపాలుడే రాజ్యం చెయ్యసాగాడు. క్రమంగా అతనికి రాజ్యం మీద కాంక్ష పుట్టింది. ఎప్పటికైనా తన మేనల్లుడు పెద్దవాడై మళ్లీ రాజ్యం తిరిగి తీసుకుంటాడు గనక ఎలాగైనా మేనల్లుణ్ణి రాజ్యం నించి వెళ్ళగొట్టాలని దుష్టపాలుడికి దుర్బుద్ధి పుట్టింది. ఈ దుర్బుద్ధి మనసులో వుంచుకుని, పైకి ఎంతో ప్రేమగల వాడిలా నటిస్తూ రాజ్యం ఏలసాగాడు.

పదునాలుగేండ్లు గడిచినై. ధీరవర్ముడికి యిప్పుడు ఇరవైయ్యో ఏడు. అన్నిరకాల విద్యల్లోనూ ఆరితేరాడు. అప్పుడు శాంతిమతి తన అన్న అయిన దుష్టపాలుడితో, "అన్నయ్యా, ఇంతకాలం నువ్వు శ్రమ తీసుకొని రాజ్యం జాగ్రత్తగా చూశావు. ఇప్పుడు నీ మేనల్లుడు పెద్దవాడైనాడు కదా. ఇక వాడి రాజ్యం వాడికి వప్పగించి నీవు పైయెత్తున వుండి చూడరాదా!" అన్నది.

"అలాగే నమ్మా! నేను మాత్రం కాదన్నానా? కాని నేను రాజ్యం వాడికి ఒప్పగించే ముందు వాడు ఒక ముఖ్యమైన పనిచెయ్యాలి. అది చేస్తేగాని మన రాజ్యం

ఒక గ్రీకు కథకు అనుకరణ



మనకు నిలవదు. అది నెరవేర్చటానికి ధీరవర్ముడి కంటే ధైర్యశాలిగాని, తెలివి గలవాడుగాని నాకు కనిపించటంలేదు. ఆ ఒక్కపని చేసివచ్చినతర్వాత రాజ్యంతో పాటు నా కూతురినే యిచ్చి పెళ్లిచేసి బ్రహ్మాండంగా పట్టాభిషేకం చేద్దామని అనుకున్నాను" అన్నాడు దుష్టపాలుడు, ఎంతో నమ్మకం కలిగేటట్టు. రాణి సరే నంది.

ఇకనేం, మర్నాడే దుష్టపాలుడు తన మంత్రివర్గాన్ని చేర దీసుకుని ఆలోచనలు మొదలుపెట్టాడు. ఆ మంత్రులు కూడా రాజుకంటె మరింత దుష్టులు కావటాన అట్టే శ్రమ లేకుండా నే ఒక పాపిష్టి ఉపాయం తట్టింది.


"ఇక్కడికి తూర్పుగా ఆరామడ దూరాన ఒక భయంకరమైన రాక్షసుడు ఉన్నాడట. ఆ రాక్షసుడు ఎట్లా వుంటాడో, ఎక్కడ వుంటాడో ఎవరికీ తెలియదు. కాని ఇప్పటికి ఎంతోమంది యోధానుయోధులు వాడిని చంపాలని ప్రయత్నించినట్లూ, కాని ఎవరివల్లా సాధ్యంకానట్లూ తెలుస్తోంది. అంతేకాదు. అలా వెళ్లినవాళ్ళలో ఏ ఒక్కడూకూడా తిరిగిరానట్లు తెలుస్తోంది. కనక, మన ధీరవర్ముడిని ఆ రాక్షసుడిని చంపిరమ్మని పంపండి. ఇదివరకు వెళ్లిన వాళ్లలాగా యితనూ తిరిగి రాలేడు. అంతటితో మీరు నిశ్చింతగా రాజ్యం ఏలుకోవచ్చు." అని ఉపాయం చెప్పారు.

రాజుకి ఈ ఉపాయం బాగా నచ్చింది. వెంటనే ధీరవర్ముణ్ణిపిలిచి యిలాచెప్పాడు:

"ఇంతకాలం నించీ నువ్వు చిన్నవాడివిగా వుండటాన రాజ్యం నేను చూస్తున్నాను. ఇప్పుడు నువ్వు అన్నివిద్యలూ బాగా నేర్చి పెద్దవాడవయ్యావుకనక యిక రాజ్యం నీకు వదులుదామని నిశ్చయించు

కున్నాను. కాని, దీనికి ముందుగా మనం ఒక పని చెయ్యాలి. అది నీవు తప్ప మరెవ్వరూ చెయ్యలేరని నా నమ్మకం. అపనిని నీవునెరవేర్చి తిరిగివచ్చిన తర్వాత నా కూతురిని నీకిచ్చి పెళ్లిచేసి మంచి ముహూర్తాన పట్టాభిషేకం చేద్దామని నిశ్చయించుకున్నాను.


"ఇక్కడికి తూర్పుగా ఆరామడ దూరంలో ఒక సముద్రపుటొడ్డున ఒక మాయరాక్షకాసుడు వున్నాడట. వాడుప్రతి ఏడూ ఏదో ఒక రాజ్యం మీద పడి ఆ రాజ్యంలో ప్రజలని అందరినీ, ఒక్కరినైనా మిగల్చకుండా చంపి వేస్తాడట. ఇప్పటికి మన శత్రురాజ్యాలేమిటి, మిత్ర రాజ్యాలేమిటి ఎన్నో వాడిచేతిలో నాశనమై పోయినవట. ఈ సారి వాడు మన రాజ్యం మీద కన్నువేసివున్నట్లు నాకు జ్యోతిష్కులు చెప్పారు. కనుక మనరాజ్యం రక్షించుకోవాలంటే వాడిని హతమార్చడం ముఖ్యమైనపని. కనుక, రేపే నువ్వు బయలుదేరి వెళ్లి, ఆ రాక్షసుణ్ణి చంపి వాడితల తీసుకు రావాలి. ఈ పనిని నువ్వు జయప్రదంగా చేసుకువస్తే మనం నిశ్చింతగా రాజ్యం ఏలుకోవచ్చు. మనగుఱ్ఱాలలో మంచిదానిని



ఒకటి చూసి తీసుకుపో. నీకు ఒకడాలూ, ఒక కత్తీ ఇస్తున్నాను. వాటి సహాయంతో నీవు ఆ రాక్షసుణ్ణి సంహరించి క్షేమంగా తిరిగిరా" అని చెయ్యెత్తి దీవించాడు.

అంతా విని రాజకుమారుడు, "అలాగే మామా. రేపే బయలుదేరి పోతాను. ఒక సంవత్సరంలోగా తిరిగి మీఎదుటికివస్తాను. అలా రాకపోతే నా కేదో అపాయం కలిగి వుంటుందని అనుకోండి." అని చెప్పి కత్తీ, డాలూ తీసుకుని గుఱ్ఱంమీద బయలుదేరాడు.

* * *



ధీరవర్మ్మడు అలా బయలుదేరి వాయు వేగంతో గుఱ్ఱంమీద పోసాగాడు. దారిలో యెన్నో కొండలూ, లోయలూ, గుట్టలూ, మిట్టలూ, వాగులూ, నదులూ, ఒకటేమిటి అఖరికి కాకులుదూరని కారడవులూ, చీమలుదూరని చిట్టడవులూ కూడా దాట వలసి వచ్చింది. అన్నికష్టాలకూ ఓర్చి, ఇన్నిటినీ దాటుతుంటూ ధీరవర్మ్మడు అలా పోతూనే వున్నాడుగాని ఎక్కడా రాక్షసుడి జాడ కనిపించలేదు. మరికొంత సేపటికి ధీరవర్మ్మడు ఒక పెద్దఎడారిలోకి వచ్చాడు. కనుచూపుమేర దూరంలో యెక్కడా మనుష్య సంచారం కనిపించకపోయేసరికి దారితప్పి పోయానేమోనని ధీరవర్మ్మడికి భయంవేసింది. గుఱ్ఱం దిగి, ఆ యెడారి మధ్యంలో ఒకచోటకూర్చుని ఏమి చెయ్యటమా అని ఆలోచించసాగాడు. ఇంతలో ఎవరో వెనకనుంచి వీపుమీద తట్టినట్లని పించింది. ఎవడైనా రాక్షసుడేమోనని ధీరవర్మ్మడు ఉలిక్కిపడి ఒక్కసారిగా లేచికూర్చుని కత్తి దూయబోయాడు.

కాని తీరాచూస్తే అతనొక వృద్ధుడు. "ఎవరబ్బాయీ, నువ్వు? ఇటెక్కడికి వెడుతున్నావ్? ఈ దారి అసలే ప్రమాదమైనది. అందులో నువ్వు ఒంటరిగా పోతున్నావు. బహుశా నీకు తెలియక ఇటు వచ్చివుండవచ్చు. ఇప్పటికైనా నా మాటవిని వెనక్కు తిరుగు. లేకపోతే చాలా ప్రమాదాలు కలుగుతై నీకు" అన్నాడా వృద్ధుడు.


అప్పుడు ధీరవర్మ్మడు ఆ వృద్ధుడితో తన మేనమామ తనకు ఒప్పగించిన పని సంగతి చెప్పి, ఆ పనిని నెరవేర్చటానికే తను బయలుదేరివెడుతున్నానని చెప్పాడు.

"ఓయి పిచ్చినాయనా! ఆ రాక్షసుణ్ణి చంపటం నీబోటి కుర్రవానివలన అయ్యే పనా? మహామహా యోధులే సగందూరం

వృథాగా వెళ్ళి వెనక్కి తిరిగి వచ్చేశారు. ఎందుకు వృథాగా ప్రాణాలు పోగొట్టు కొంటావ్? నామాట విని ఇప్పటికైనా తిరిగి ఇంటికిపో." అన్నాడు వృద్ధుడు.

"అదేమీ కుదరదు. ఈ పని చేసిగాని తిరిగి రానని నేను నా మేనమామ దగ్గర వాగ్దానం చేసివచ్చాను. వాగ్దానం చెయ్యనే కూడదు గాని, తీరా చేశాక అది నెరవేర్చ కుండా తిరిగి వెళ్లటం మా వంశంలోనే లేదు. దీంట్లో నా ప్రాణం పోయినా సరే నేను ఈ ప్రయత్నంనించి మానుకుని యింటికివెళ్ళలేను" అని బదులు చెప్పాడు ధీరవర్ముడు.

ఇంకా నిండా పాతికేళ్లయినా నిండని ఆ రాకుమారుని ధైర్యపుమాటలు వినేసరికి వృద్ధుడికి ఎంతో అశ్చర్యం కలిగింది. చాల ప్రమాదమైనపనికి యింతధైర్యశాలి అయిన మేనల్లుణ్ణి ఎలా పంపగలిగాడా అని దుష్టపాలుడి యెడల ఎంతో ఆగ్రహం కలిగింది. "పాపం, ఏమీ ఎరుగని యితనిని కష్టాలపాలు చెయ్యాలనే దుర్బుద్ధితోనే అత నిలాచేసివుంటాడు. ఇందుకు తగ్గ ఉపాయ మేదైనా ఆలోచించి దుష్టపాలుడికి మంచి పాఠం నేర్పాలి" అనుకున్నాడు వృద్ధుడు.



"అబ్బాయి! నీవు చెయ్యదలచుకొన్న పనిలో నీకు విజయంకలిగేటట్లు చూస్తాను. సరే, మరి నీవెంట ఏమేమి ఆయుధాలు తెచ్చావ్?" అని అడిగాడు వృద్ధుడు.

"ఇదుగో ఈ డాలూ, కత్తీ తెచ్చాను" అని ధీరవర్ముడు అవి రెండూ చూపించాడు. అవిచూసి వృద్ధుడు పకపకానవ్వి, "భలే ఆయుధాలు. పైగా ఇవి చూడబోతే మీ తాతలనాటివిలావున్నై. వీటితోనా నువ్వు రాక్షసుడిని చంపటానికి బయలుదేరావ్" అన్నాడు. ధీరవర్ముడు యిది విని చిన్నబోయాడు. ఇది చూచి వృద్ధుడు, "సరేలే



యిప్పుడు దీన్నిగురించి విచారించటం ఎందుకు? సరే, ప్రస్తుతం మనం బయలు దేరేముందు నువ్వు నీ డాలుని తళతళ మెరిసేలాగున తోము. నీ ముఖం నీకు అద్దంలో కనిపించినట్లు నీ డాలులో కనిపించేటంతగా మెరుస్తుండాలి. ముందు యిది చెయ్యి" అన్నాడు.

ధీరవర్ముడు అలాగే తన డాలుని తళతళ మెరిసేలా తోమాడు. వృద్ధుడుకూడా ధీరవర్ముడి నేర్పుచూసి చాల మెచ్చుకున్నాడు. "భేష్! అలా వుండాలి." అని అతని భుజంమీద తట్టాడు.

ఇదంతా అయిన తర్వాత వృద్ధుడు ముందు, అతని వెనుకనే గుఱ్ఱంమీద ధీరవర్ముడూ బయలుదేరి పోసాగారు. నడుస్తూ నడుస్తూ వృద్ధుడు ఒక్కసారిగా మాయమయ్యాడు. ధీరవర్ముడికి చాల భయం వేసింది. చుట్టూ చూశాడు–ఎక్కడా వృద్ధుడి జాడ కనిపించలేదు. అలా చూస్తూవుండగా, వృద్ధుడు వంద గజాల దూరంలో గాలిలో తేలిపోతూ వున్నాడు. "ఇదేమివింత! ఇప్పటి దాకా నాతోపాటు నడుస్తున్నవాడు యిలా పక్షిలా ఎలా గాలిలో తేలిపోగలిగాడు?" అనుకుంటూ ధీరవర్ముడు వృద్ధుడి వంక పరీక్షగా చూడసాగాడు. అప్పుడు వృద్ధుడి కాళ్ల చెప్పులకు రెక్కలు వుండటం ధీరవర్ముడికి కనిపించింది. "ఓహో, ఇదా సంగతి!" అని మనస్సులో అనుకుని ధీరవర్ముడు తనగుఱ్ఱాన్ని మరింతవేగంగా తోలసాగాడు. కాని, వృద్ధుణ్ణి కలుసుకోవటం మాత్రం ధీరవర్ముడికి సాధ్యంకాలేదు.

ముందు గాలిలోపోతున్న వృద్ధుడు ఒకసారి వెనక్కు తిరిగి "ఏమోయ్, మనమడా, గుఱ్ఱమీంద వస్తున్నా కూడా నువు, పాపం, చాలా వెనకపడ్డావేం? ఇంతేనా నీ బలం!" అని వెక్కిరించినట్టుగా అడిగాడు. తను

కాళ్లకు రెక్కల చెప్పులు తొడుక్కున్న సంగతి, ధీరవర్మ్మడు కనిపెట్టలేదనే నమ్మకంతోనే వృద్ధుడు యిలా అన్నాడు.

"మీరు తొడుక్కున్నలాంటి రెక్కల చెప్పులు నాకూ వుంటే గుఱ్ఱాన్ని వదిలేసి నేనూ వస్తాను. అప్పుడు తెలుస్తుంది ఎవరు వెనకపడేదీ ?" అన్నాడు ధీరవర్మ్మడు.


"ఓహెూ, కనిపెట్టావన్నమాట! ఎలాగైనా తెలివిగల బుర్రనీది. సరే, యిప్పుడు నీకు మరో జత చెప్పులు తేవటం కుదరదు. యిదుగో, ఈ కర్ర చేతితో పట్టుకో. ఇక నువ్వూ నాతోపాటే గాలిలో తేలిపోతూ రాగలుగుతావు" అని చెప్పి తనచేతిలో వున్న కర్రని ధీరవర్మ్మడివైపు విసిరివేశాడు.

ధీరవర్మ్మడు అది చేతపుచ్చుకోగానే తనూ గాలిలో తేలిపోసాగాడు.

దారిలో ధీరవర్మ్మడు అడిగాడు—"ఆరాక్షసుణ్ణి గురించి చెబుతానన్నారుగదా ఇప్పుడు చెప్పండి" అని.

అప్పుడు వృద్ధుడు యిలా చెప్పసాగాడు:

"ఆ రాక్షసుడు సామాన్యమైనవాడు కాడు. వాడి ఒళ్లు గట్టి లోహంతో చేయబడి వుంటుంది. పలుగులతోనైనా బ్రద్దలు చెయ్యటానికి సాధ్యంకాదు. పెద్దపెద్ద




కోరలతో చూడటానికి చాల భయంకరంగా వుంటాడు. వాడికి మూడు తలలు వుంటై. తలమీద వెంట్రుకలకు బదులు లెక్కలేనన్ని పాములు బుసలుగొడుతూ వుంటై. వాడికి బంగారులా మెరిసే రెక్కలుకూడా వుంటై. వాటి సహాయంతో వాడు ఆకాశంలో ఎగరగలడు కూడా. అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన సంగతి ఒకటి వుంది. ఎవరైతే వాడివంక చూస్తారో వాళ్ళు అపళంగా నిలువున రాయిగా మారిపోతారు. కనుక నువ్వు ఆ రాక్షసుణ్ణి చంపాలంటే వాడి దగ్గిరికి చేరడమే ఎంతో కష్టం. ఒకవేళ ఎలాగైనా అక్కడికి చేరుకున్నావే అనుకో. వాడివంక నువ్వు చూడకుండా, కళ్ళు మూసుకుని వాడిని చంపాలి. మరి, యిప్పుడైనా చెప్పు ఈ పని మానుకునిపోతావో, కాదు కూడదు చేసి తీరతానంటావో."

"అలాంటి పిరికిపందని కానని మొదటే చెప్పాను. వెనక్కు తిరిగిపోవట మనేది కలలో వార్త. నా ప్రాణంపోయినా సరే ఈ ప్రయత్నంమానను" అన్నాడు ధీరవర్ముడు.

"సరే యిప్పుడు మనం ముగ్గురు గుడ్డివాళ్ళదగ్గిరికి పోవాలి. ఈ పని జయప్రదంగా ఎలా చెయ్యాలో చెప్పగలిగింది ఆ గుడ్డివాళ్ళే." అన్నాడు వృద్ధుడు.

"ఎవరా ముగ్గురు గుడ్డివాళ్ళు? వాళ్ళు ఎక్కడ వుంటారు?" అని ఆత్రంగా అడిగాడు ధీరవర్ముడు.

[ఆ గుడ్డివాళ్లెవరో, వృద్ధుడేమి చెప్పాడో, ఆ తర్వాత ఏమి జరిగిందో వచ్చేనెల చందమామలో చదవండి.]





పాపిష్ఠి ముఖాలు

"ఆ గుడ్డివాళ్లెవరు? వాళ్ళు ఎక్కడ వుంటారు?" అని ధీరవర్ముడు అడిగిన దానికి వృద్ధుడు యిలా చెప్పసాగాడు—

"వాళ్ళు ముగ్గురూ అక్కచెల్లెళ్ళు. ముగ్గురూ గుడ్డివాళ్లే. కాని, ముగ్గురి మొహాల మధ్యనా ఒక లొట్టకన్ను వుంటుంది. వాళ్లు ముగ్గురూ వాడుకోటానికి ఒకే ఒక కన్ను వుంటుంది. ఆ కనుగ్రుడ్డును తమ లొట్ట కంటిలో పెట్టుకు చూసిన వాళ్లకి వెయ్యి కళ్లతో చూచినంతగా అన్నీ కనిపిస్తై. ఆ కనుగ్రుడ్డును ఒకరి తర్వాత ఒకరు పెట్టుకుని చూస్తూవుంటారు. ఆ గ్రుడ్డుని ఎవ్వరూ రెండు నిమిషాలకంటే ఎక్కువసేపు వుంచుకోకూడదు. మొదటిది గ్రుడ్డుని పెట్టుకుని రెండు నిమిషాలసేపు చూస్తుంది. ఆ రెండు నిమిషాలు పూర్తి కాగానే దాన్ని రెండోది తీసుకొని పెట్టుకు చూస్తుంది. తర్వాత మూడోది. ఇలా వరస ప్రకారం వాళ్ళు ఆ ఒక్క గ్రుడ్డుతోటే చూస్తూవుంటారు. ఎవరైనా రెండు నిమిషాలకి పైన గ్రుడ్డుని ఒక్క క్షణం వుంచుకున్నాసరే ఆ తర్వాతది పోట్లాడి తీసుకుంటుంది. ఆ గ్రుడ్డు లేకపోతే వాళ్లు ఒక్క క్షణం వుండలేరు. కనుక ముందు మనం ఆ గ్రుడ్డుని వాళ్లదగ్గిర్నించి కాజెయ్యాలి" అని చెప్పాడు వృద్ధుడు.

"సరే అలాగే చేద్దాం. కాని వాళ్ళు ఎక్కడ వుంటారో చెప్పనేలేదే?" అని అడిగాడు ధీరవర్ముడు.

"సూర్యుడుగానీ, చంద్రుడుగానీ, వుండగా వాళ్లు బైటికిరారు. సాయంత్రం కను మసక చీకటివేళ వాళ్లు బైటికి వచ్చి ఆ కన్నుగ్రుడ్డు పెట్టుకుని చూసి, ఎవరైనా మనుష్యులు కనిపిస్తే పీకుకుతిని చంద్రుడు ఉదయించేవేళకి మళ్లీ మాయమవుతారు." అని చెప్పాడు వృద్ధుడు.

ఒక గ్రీకు కథకు అనుకరణ



ఇదంతా చెప్పేసరికి అప్పుడే సూర్యుడు అస్తమించాడు. చీకటి పడసాగింది. మరి కాసేపటికి వాళ్లు ఒక పెద్ద ఎడారిలాంటి చోటికి వచ్చారు. అక్కడ చిన్నచిన్న తుప్పలు దుబ్బులు తప్పితే మరేమీలేవు.

"ఇప్పుడే, ఈ చోటికే ఆముగ్గురు గుడ్డివాళ్ళూ వచ్చేది. మనం చాల జాగ్రత్తగా వుండాలి" అని వృద్ధుడు అంటూ వుండగానే దూరాన ఎక్కడో అడుగుల చప్పుడు వినిపించింది. ఆ చప్పుడు చెవినిపడగానే వాళ్లిద్దరూ ఒకపొదచాటున దాక్కున్నారు.

ఇంతలో ఆ ముగ్గురు గ్రుడ్డివాళ్ళు అక్కడికి వచ్చి చేరుకున్నారు. వృద్ధుడు చెప్పినట్లు వాళ్లు ముగ్గురూ గుడ్డివాళ్లే. ఇప్పుడు మధ్యవున్న గ్రుడ్డిది కనుగ్రుడ్డు, తన కనులొట్టలో పెట్టుకుచూస్తోంది.

ఇంతలో మూడో గ్రుడ్డిది, "అక్కా, అక్కా, రెండు నిమిషాలు అయిపోయింది ఇప్పుడు నావంతు" అంది.

"నాకు మాత్రం తెలియదా యిప్పుడు నీ వంతు అని! కాని, ఆ పొదలవెనకాల ఎవరో వున్నట్టుగా వుంది. అదేమిటో చూచి యిస్తాను" అంది మధ్యది.

"ఓహో, నువ్వే చూడాలా ఏమిటి? నేనుమాత్రం చూడలేనా? నావంతు కనక నా కిచ్చెయ్యి. నేను చూచి చెబుతాను" అంది మూడోది.

ఈ వాదన జరిగేసరికి మూడోదానివంతు రెండు నిమిషాలుకూడా పూర్తి అయినై. ఇప్పుడు మళ్లీ మొదటిదానివంతు. అందుచేత అది, "మీరు యిద్దరూ ఎందుకు పోట్లాడుకోవటం? ఇప్పుడు నా వంతు. గ్రుడ్డు నా కిచ్చెయ్యండి" అన్నది.

ఇది వినేసరికి గ్రుడ్డుపెట్టుకునివున్న మధ్యదానికి తగనికోపం వచ్చింది. తన

ముఖంమీద లొట్టలో వున్న ఆ గ్రుడ్డుని కాస్తా వూడతీసి తన అరచేతిలో పెట్టుకుని "సరే, పోట్లాట ఎందుకు? గ్రుడ్డు నేనూ పెట్టుకోలేదు. ఇదుగో నా చేతిలోవుంది. మీలో ఎవరు తీసుకోగలిగితే వాళ్ళు తీసుకోండి" అని కూర్చొపడింది.

ఇప్పుడు ముగ్గురూ గ్రుడ్డివాళ్లే. అందుచేత గుడ్డువున్న మధ్యదాని చెయ్యి ఎక్కడ వుందో మిగతా యిద్దరికీ తెలియ లేదు. అందుచేత వాళ్ళు చేతులతో నాలుగు వైపులా తడుముకోసాగారు.

వృద్ధుడు ధీర వర్మణ్ణి హుషారు చేసి "నువ్వు ఆ గ్రుడ్డుని ఎత్తుకు రావటానికి యిదేసమయం. ఊ, పద" అని ముందుకు తోశాడు. మరుక్షణంలో ధీరవర్మడు వాళ్ళ చేతులకు దొరకకుండా ఆ గ్రుడ్డు తెచ్చి వృద్ధుడి కిచ్చాడు.

తన చేతిలోంచి గ్రుడ్డు ధీరవర్మడు కాజేసి పోగానే, దాన్ని మిగత చెల్లెళ్ళలో ఎవరో ఒకరు కాజేసిఉంటా రనుకొని మధ్యది పోట్లాడ సాగింది. కాని మేము తియ్యలేదంటే మేము తియ్యలేదని వాళ్లు



మొత్తుకో సాగారు. ఎంతసేపటికీ ఎవరూ గ్రుడ్డు త మ కి దొ రి కి న ట్టు బ య ట పెట్టక పోయేసరికి, ఒకళ్ళకి మరొకళ్ళ మీద అనుమానం పుట్టింది - గుడ్డు దొరికిన వాళ్ళే ఆ సంగతి బైటపెట్టకుండా మిగతా వాళ్లని ఏడిపిస్తున్నారని. ఇకనేం ముగ్గురూ పెద్దగా అరుస్తూ పోట్లాడుకో సాగారు.

వృద్ధుడికి, పాపం వాళ్ళని చూసేసరికి, జాలికలిగింది—"ఓ పిచ్చి పుల్లమ్మల్లారా! ఎందుకు వృ థా గా పోట్లాడుకుంటారు. గ్రుడ్డు నా దగ్గిర వుంది. నాకు మీరు ఒక విషయం చెప్పాలి. ఇక్కడికి దగ్గిర్లో మూడు తలల రాకసుడు ఒక డున్నాడట. అక్కడికి ఎలా వెళ్లాలో చెప్పండి. ఈ రహస్యం చెబితేగాని గ్రుడ్డుని తిరిగి మీకు ఇవ్వను" అన్నాడు.

"ఎవరు బాబూ నువ్వు? గుడ్డు కాజేసి పైగా మూడుతలల రాకసు డ ం టు న్నా వేమిటి? మాకు ఏ రాకసుడి సంగతీ తెలియదు. మా గుడ్డు మా కిచ్చి నీదారిన నువ్వు పో" అన్నారు గ్రుడ్డివాళ్ళు.

"అదేమీ కుదరదు. వాడు యెక్కడ వుండేదీ మీకుతెలుసు. తెలియదని మొండి కేస్తే, యిక మీ కర్మం యింతే. గుడ్డుతో సహా మా దారిన మేము పోతాం" అని బెదిరించాడు వృద్ధుడు.


"అయ్యో! అసలే ముసలి ముండలం, మాకేమీ తెలియదని ఏడుస్తుంటే ఈయ నెవరో కన్ను ఎత్తుకుపోతానని బెదరిస్తా డేమిటే!" అన్నది మొదటి ముసలిది.

"అలాగే బెదిరిస్తాడులే. చూద్దాం కన్ను ఎలా ఎత్తుకుపోతాడో!" అంది మధ్యది.

• • •

[ఇంతకీ ఆ రహస్యం గుడ్డివాళ్లు బైట పెట్టారో లేదో తర్వాత ఏమి జరిగిందో వచ్చేనెల చందమామలో చదవండి.]





పాపిష్టి ముఖాలు.

గ్రుడ్డివాళ్లు యీవిధంగా చెప్పసాగారు—
"ఇటు దక్షిణంగా కొంత దూరం పోతే ఒక పెద్దసరస్సు కనిపిస్తుంది. దానికి కొంచెందూరంలో ఒక మేడలో ముగ్గురు యక్షకన్యలు ఉంటారు. వాళ్లు రాత్రిళ్లు ఇంద్రలోకంనించి వచ్చి, ఆ సరస్సులో స్నానంచేసి, ఆ రాత్రి అల్లా అక్కడి మేడలో నిద్రపోయి తెల్లవారేలోగా దేవలోకం చేరుకుంటారు. మీరు మూడుతలల రాక్షసుణ్ణి చంపటానికి ముఖ్యంగా మూడు వస్తువులు కావాలి—అవి ఏమిటంటే, ఒక మాయసంచీ, పంకరకత్తీ, మాయకిరీటం. ఇవి మూడూ ఆ యక్షిణుల దగ్గిర ఉంటై. ఆ యక్షకన్యలు నిద్రపోబోయేముందు తమ నెత్తిన వున్న కిరీటాలని అక్కడి గోడలకి తగిలించి పడుకొంటారు. ఆ కిరీటాలని తిరిగి తలలకి పెట్టుకొంటేనే గాని వాళ్లు దేవలోకంచేరలేరు. అందుకని, మీరు ఎలాగైనా వాళ్ళ కిరీటాలని కాజేశారంటే, మీకు ఆ మూడు వస్తువులూ యిస్తారు. వాటితో ఆ మూడు తలల రాక్షసుణ్ణి తేలికగా చంపవచ్చును."

"సరే, బాగానేఉంది. మీగుడ్డును మళ్లీ మీకాళ్ళదగ్గిర పెడుతున్నాను తీసుకోండి" అని వృద్ధుడూ, ధీరవర్ముడూ గ్రుడ్డుని వాళ్ళ కాళ్ళదగ్గిర పెట్టి ఒక్కసారిగా మళ్లీ గాలిలోకి ఎగిరిపోయారు.


• • •

గ్రుడ్డివాళ్లు చెప్పిన గుర్తులని బట్టి పోగా పోగా ఒక పెద్ద తోటా, అందులో ఒక సరస్సూ, ఆ సరస్సుచుట్టూ చలువరాతితో కట్టబడిన ఒక పెద్ద మేడా కనిపించినై. మేడలో మూడు హంసతూలికా తల్పాల మీద ముగ్గురు యక్ష కన్యలు గాఢనిద్ర


ఒక గ్రీకు కథకు అనుకరణ

పోతున్నారు. అప్పటికప్పుడే తెల్లవారబోతోంది. మరి కొంచెంసేపట్లో వాళ్లు లేచి, మళ్లీ తమతమ కిరీటాలు పెట్టుకుని దేవలోకం చేరుకుంటారు. ఇక ఆట్టే ఆలస్యం చేస్తే లాభంలేదు. అందుచేత వృద్ధుడు ధీరవర్మణ్ణి త్వరగాపోయి వాళ్ల కిరీటాలు యెత్తుకు రమ్మన్నాడు. ధీరవర్ముడు కూడా అలాగే అడుగులో అడుగువేసుకుంటూ, ఏమాత్రం శబ్దమూ చెయ్యకుండా యెంతో జాగ్రత్తగా వెళ్లి కిరీటాల్ని ఎత్తుకొచ్చాడు.

అయితే వాళ్లకి కావలసింది ఆ కిరీటాలు కాదుగదా! అందుచేత ఆ మూడు కిరీటాలూ జాగ్రత్తగా తమ దగ్గిర వుంచుకుని, ఆనందంగా పాటలు పాడటం మొదలు పెట్టారు. ఈ గంద్రగోళం చెవిని పడంగానే ఆ యక్షకన్యలు ముగ్గురూ ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి కూచున్నారు. తమ కిరీటాలకోసం చూసుకున్నారు. కనిపించలేదు. గాభరాగా అటూయిటూ చూశారు. సరస్సు ఒడ్డున వృద్ధుడూ, ధీరవర్ముడూ ఆడుతూపాడుతూ



వుండటం వారికి కనిపించింది. వాళ్ల దగ్గిర తమ కిరీటాలు వుండటం చూసేసరికి యక్షకన్యలకు పట్టరాని కోపం వచ్చింది. ఒక్క పరుగున వృద్ధుడూ, ధీరవర్ముడూ వున్న చోటికి వచ్చారు. కాని వీళ్లు అంత తేలికగా చిక్కుతారా! వాళ్ళని దాదాపు దగ్గిరికి రానిచ్చి యిద్దరూ ఒక్క సారిగా గాలిలోకి ఎగిరిపోయి. అక్కడినించి, వాళ్ళకి కిరీటాలు చూపించి ఏడిపించటం మొదలు పెట్టారు. యక్షిణులకు యేమి చెయ్యటానికీ తోచలేదు. కిరీటాలు లేనిదే వాళ్లు చెయ్యగలిగింది ఏమీలేదు. అందు చేత 'మా కిరీటాలు మా కివ్వండి.' అని ఎంతో బ్రతిమాలుకోసాగారు.




అప్పుడు వృద్ధుడు యిలా అన్నాడు— "అలాగే యిస్తాను. కాని, వాటికి బదులుగా మీరు మాకు మూడువస్తువులు యివ్వాలి. అవి మీరు యిచ్చేవరకూ మీ కిరీటాలు తిరిగి యివ్వను."

"సరే అలాగే యిస్తాము. అవేవో చెప్పు" అన్నారు ముగ్గురు యక్షిణులూ ఒక్కసారి.

అప్పుడు వృద్ధుడు గ్రుడ్డివాళ్లు చెప్పిన సంచీ, కత్తీ, కిరీటమూ కావాలని కోరాడు.

సరే మొదటి యక్షిణివెళ్లి ఒక సంచీ తెచ్చింది. అది జింకచర్మంతో చెయ్యబడిన చిన్నమనీపర్సులాంటిది. దానిమీద అక్కడక్కడ బంగారుపూలు కుట్టివున్నై. రెండో యక్షిణివెళ్లి ఒక పొడుగాటి కత్తి తెచ్చి యిచ్చింది. అది తళతళమెరుస్తూ చాల పదునుగా వుంది. మూడో యక్షిణివెళ్లి ఒక ఉక్కు కిరీటం తెచ్చింది. ఈ మూడిటినీ ఒక్కచోటవుంచి, యక్షిణులు వృద్ధుడిని "యిక దిగిరావయ్యా మహానుభావా. నీవు కోరిన మూడువస్తువులూ యివిగో. యివి తీసుకుని మా కిరీటాలు మాకిచ్చి నీదారిని నువ్వు పో" అన్నారు.

సరేనని వృద్ధుడూ, ధీరవర్ముడూ ఆ మూడు వస్తువులూతీసుకుని వాళ్ల కిరీటాలు



వాళ్లకిచ్చి తిరిగి రివ్వున గాలిలో తేలిపోసాగారు.

"బ్రతుకు జీవుడా. మనల్ని యింతటితో వదిలిపెట్టాడుగాని, ఆ కిరీటాలే తీసుకుపోయివుంటే మళ్లీ మనకు దేవలోక ప్రాప్తి వుండేదే కాదు" అని యక్షిణులు అక్కడ నిలవకుండా తమతమ కిరీటాలు పెట్టుకుని దేవలోకానికి బయలుదేరి పోయారు.

* * *

అప్పటికి బాగా తెల్లవారింది. ధీరవర్ముడూ, వృద్ధుడూ మళ్లీ భూమిమీదికి దిగి ఒక చోట కాసేపు విశ్రాంతి తీసుకుందామని కూర్చున్నారు. ఇంటిదగ్గిర నుంచి బయలుదేరినతర్వాత ఇంతవరకూ, తిండి అంటూ లేదు గనక ధీరవర్ముడికి తగని ఆకలి వేస్తోంది. చుట్టూ చూశాడు. ఏమీ కనిపించలేదు. నోరు తెరిచి వృద్ధుణ్ణి అడిగాడు, ఆకలి తీరే మార్గం ఏదైనా చెప్పమని.

ఇది విని, వృద్ధుడు పకపకా నవ్వసాగాడు. ధీరవర్ముడికి ఎక్కడలేని కోపం వచ్చింది. "నాకు ఆకలి మండిపోతోందంటే నీకు నవ్వుగా వుందా? రెక్కల చెప్పులు తొడుక్కుని నన్ను మొదట మోసగించి గాలిలో గొప్పగా ఎగిరినట్లుగానే, ఆకలికాకుండా వుండేందుకు నువ్వేమైనా మందు తిన్నావేమో!" అన్నాడు రోషంగా.

"అదిగాదోయ్ పిచ్చినాయనా, ఇంత కష్టపడీ మనం సంపాదించిన మూడు వస్తువులూ ఎందుకనుకున్నావ్! వాటిని గురించి అడిగి తెలుసుకోకుండా 'ఆకలో' అని నువ్వు గోలపెట్టేసరికి నాకు నవ్వు వచ్చింది. ఎందుచేతనంటే ఆకలి తీర్చేందుకే మనం ఆ సంచీ కోరింది. అది మన దగ్గిర వున్నంతకాలం మనకు ఆకలి భయం అక్కర్లేదు" అని చెబుతూ తనదగ్గిరవున్న ఆ సంచిని మూతి విప్పి బోర్లించాడు. సంచీ బోర్లించగానే దాంట్లో నించి రకరకాల పళ్లూ రాసాగినై. "ఇక చాలు, ఈ పూటకి"

అని ధీరవర్మడు అనేవరకూ వృద్ధుడు సంచీ మూతి తెరిచే వుంచాడు. తర్వాత మళ్లీ దానిమూతి బిగించి తన దగ్గిర భద్రంగా దాచివుంచాడు.



సంచీలోంచి వచ్చిన పళ్లూ అవీ కడుపు నిండా తిని ధీరవర్మడు "అమ్మయ్య! ఇక రెండురోజులవరకూ ఏమీ తిండిఅక్కర్లేదు అన్నాడు. తర్వాత వృద్ధుడు, యక్షిణులిచ్చిన కత్తిని ధీరవర్మడికి ఇచ్చి అంతకు ముందు అతని వద్దవున్న కత్తిని విసిరి పారేశాడు. తర్వాత మాయకిరీటం చూపి, ఈ కిరీటాన్ని నీ నెత్తిన పెడతాను. భలే గమ్మత్తు జరుగుతుంది చూడు" అంటూ ఆ మాయకిరీటాన్ని ధీరవర్మడి నెత్తిన పెట్టాడు. కిరీటం నెత్తిన పెట్టగానే ధీరవర్మడు ఒక్కసారిగా మాయమైనాడు. ఒక్క కిరీటం మాత్రమే వృద్ధుడి పక్కన గాలిలో నిలిచింది.

"ఇప్పుడెక్కడున్నావ్ మనమడా?" అని అడిగాడు వృద్ధుడు.

"ఎక్కడేమిటి! ఎప్పటిలాగా నీ ప్రక్కనే వున్నాను" అని బదులు చెప్పాడు ధీరవర్మడు.

"నేను నీకు ఎప్పటిలా కనిపిస్తున్నానా?" అని అడిగాడు వృద్ధుడు.

"ఆహా, బాగానే కనిపిస్తున్నావు. నేను నీకు కనిపించటంలేదా ఏమిటి?" అని ఆశ్చర్యంగా అడిగాడు ధీరవర్మడు.

"లేదు. నీ తలకు నేనుపెట్టిన కిరీటం మాత్రమే గాలిలో నిలిచి కనిపిస్తోంది. ఇదేవిధంగా ఆ రాక్షసుణ్ణి చంపబోయేటప్పుడు నువ్వు వాడిని చూడగలుగుతావు గాని, నువ్వు ఎక్కడ వున్నావో వాడు కనుక్కోలేడు. మరి చూశావా! యక్షిణులు యిచ్చిన మూడు వస్తువులూ మన కెంత ఉపయోగపడ్డయ్యో" అని చెప్పి మళ్ళీ బయలుదేరారు.

[ఇంకా వుంది]



ఇప్పుడు వృద్ధుడూ, అతని ప్రక్కనే ధీరవర్మ్మడి కిరీటం గాలిలో తేలుతూ పోతూ వున్నారు. వీళ్ళ యిద్దరికి పైన యింకో గజం ఎత్తులో మరో కిరీటంకూడా గాలిలో తేలిపోతూవుంది. అది వృద్ధుడి మేనకోడలిదే. వృద్ధుడు బయలు దేరి, ఎక్కడికి వెళ్లినా ఆమెకూడా అదృశ్యంగా వస్తూనేవుంటుంది. ఈ సారి వృద్ధుడు ధీరవర్మ్మడిని కలుసుకున్నప్పటినించికూడా ఆమె ఆకాశంలో తేలుతూ వస్తూనేవుంది. ఈ సంగతి ధీరవర్మ్మడికి తెలియదు.

మధ్య దారిలో కిరీటంగా మాత్రమే కనిపిస్తున్న వృద్ధుడి మేనకోడలు వాళ్లతలల పైకి చాల దగ్గిరికి వచ్చింది. ఆ కిరీటానికి రెక్కలుకూడా వుండటంవల్ల ఆ రెక్కల చప్పుడు ధీరవర్మ్మడి చెవిన పడింది. "ఏమిటి, తాతా ఏదో రెక్కల చప్పుడవుతోంది?" అని అడిగాడు.

"అది ఉత్త చప్పుడు కాదు. నా మేనకోడలు ఒకామె వుంది. ఆమెకూడా నీలాగే ఒక మాయకిరీటం ధరించి మొదటినించీ మనతోపాటు వస్తోంది. ఆమె కిరీటానికి రెక్కలుకూడా వున్నై. నువ్వు విన్నది ఆ రెక్కల చప్పుడే. ఆమె మనిద్దరికీ పైగా వున్నది చూడు" అని చెప్పాడు వృద్ధుడు.

ధీరవర్మ్మడు తల పైకెత్తి చూశాడు. వృద్ధుడు చెప్పినట్లుగానే యింకో కిరీటం, రెక్కలు రెపరెప కొట్టుకుంటూ వస్తూవుంది.

అలా వాళ్ళు వస్తూ వుండగా, ఒకచోట వృదుడు "మనమడా, ఇక జాగ్రత్త. ఆ రాక్షసుడుండే చోటికి చాల దగ్గిరగా వచ్చాము. పొరపాటున నీవు వాడివంక చూశావంటే వెంటనే రాయిగా మారిపోతావు. ఇంతవరకూ మనం పడ్డ కష్టమంతా వృథా అవుతుంది. అందువల్ల చాల జాగ్రత్తగా వుండు" అని హెచ్చరించాడు

ఒక గ్రీకు కథకు అనుకరణ



"అలాగే తాతా, మరి మీరు మాత్రం కళ్లు మూసుకుని వుండవద్దా?" అని అడిగాడు ధీరవర్ముడు.

"మేము వాడిదగ్గిరికి రాము. అందువల్ల మేము కళ్లు మూసుకోవలసిన అవసరం లేదు. నీవు మాత్రం చాల జాగ్రత్తగా వుండాలి. వాడు ఏమిచేస్తున్నాడో వాడివంక చూడకుండా నువ్వు చూడగలగటానికే నీ డాలును అద్దంలా తోమమన్నాను. డాలుని అందుకు ఉపయోగించుకో" అని చెప్పాడు వృద్ధుడు. సరేనన్నాడు ధీరవర్ముడు.

ఇప్పుడు వాళ్లు ఒక సముద్రంపైన ఎగురుతున్నారు. క్రింద సముద్రపు ఒడ్డుకు కొంత దూరంలో ఆ రాక్షసుడు గుర్రుపెట్టి నిద్రపోతుండటం వృద్ధుడికి కనిపించింది. వాడి తలల మీదవున్న పాములు బుసలు గొడుతున్న శబ్దంకూడా వినిపిస్తోంది.

"అదుగో అక్కడ సముద్రపు ఒడ్డున చూడు. నీవు చంపవలసినది వాడినే. కిరీటం క్రింద మాయమై వున్నావు కనుక నువ్వు ఎక్కడ వున్నదీ వాడు తెలుసుకో లేడు కాని వాడిని నువ్వు చూడగలవు. చూడగలను కదా అని వాడివంక మామూలుగా చూసేవు జాగ్రత్త. నీ డాలు లోకి వాడి ప్రతిబింబం కనిస్తుంది కనుక డాలులో చూస్తూవుండు. నేను నీకు యిది వరకు యిచ్చిన కత్తి వాడిని నరకటానికి పనికివస్తుంది. ఒక్కవ్రేటున వాడి తలలని నరికి, వాటిని ఈ సంచీలో పెట్టి బిగించి తీసుకురా" అని చెప్పి యక్షిణి యిచ్చిన మాయ సంచీ యిచ్చాడు వృద్ధుడు.

"ఇదేమిటి? ఈ సంచిని ఆకలి తీర్చు కునేందుకేకదా వాళ్లు మనకు యిచ్చింది. దీంట్లో ఆ పాపిష్ఠి తలలని పెట్టటమేమిటి? ఐనా అంత పెద్దతలలు ఈ చిన్నసంచీలో

ఎలా పట్టుతై?" అని అడిగారు ధీరవర్ముడు.

"అదంతా అనవసరం. నేను చెప్పినట్లు చెయ్యి. ఇక అలస్యంచేస్తే లాభంలేదు. వాడు నిద్రలేచాడంటే మళ్లీ ఏడాదివరకూ నిద్రపోడు. వెంటనే పో" అని తొందరచేసి ధీరవర్మణ్ణి తరిమాడు వృద్ధుడు.

ధీరవర్ముడు ఎకాయెకిని సముద్రపు ఒడ్డుకు వచ్చి, ఆ రాక్షసుడిపైకి కొద్ది దూరంలో గాలిలో తేలుతూ సమయం కోసం చూస్తున్నాడు. రాక్షసుడు దిట్టంగా నిద్రపోతున్నాడు. కాని వాడి తలలమీద వున్న పాములు బ్రహ్మాండంగా బుసలు కొడుతున్నై. ఇదంతా ధీరవర్ముడు తన డాలులో చూసి కనిపెడుతూ న్నాడు.

దూరాన్నించి ఆకాశంలో వృద్ధుడూ అతని మేనకోడలు కూడా యిది చూస్తూనే వున్నారు. ధీరవర్ముడు ఆలస్యం చెయ్యటం చూచి వృద్ధుడు "ఇంకా చూస్తావేం, నరుకు" అని పెద్దగా కేకవేశాడు.

ఈ కేక ధీరవర్ముడి చెవిన పడట మేమిటీ, ధీరవర్ముడి చేతిలోవున్న కత్తి రాక్షసుడి మెడమీద పడి సర్రున మూడు తలలు మొండెంనించివేరుకావట మేమిటీ





ఒక్కసారిగా జరిగినై. ఇక ధీరవర్ముడు ఆ తలల్ని సంచీలో పెట్టటానికి మూతి విప్పి, మూతిని వెడల్పుగా లాగాడు. లాగినకొద్దీ సంచీ మూతి పెద్దది అవుతూనే వుంది. ఇకనేం రాకసుడి తలలని దాంట్లో పెట్టి మళ్లీ మూతి బిగించాడు. సంచీలోంచి రాకసుడి తలలమీద వున్న పాములు ఇంకా బుసలు కొడుతూనేవున్నై.


మరికొంతసేపటిలో ధీరవర్ముడు సంచీతో సహా వృద్ధుడూ వాళ్లు వున్నచోటికి చేరుకున్నాడు. "రాకసుడితలల్ని నువ్వునరికినా, ఇంకో ఆరునెలలదాకా ప్రాణంవుంటుంది. అందుచేత సంచీమూతిని ఏలాటి పరిస్థితుల్లో విప్పనే కూడదు." అన్నాడు వృద్ధుడు.

అలాగే వృద్ధుడు మామూలు రూపంతో, ధీరవర్ముడు కిరీటం రూపంతో వృద్ధుడి మేనకోడలు రెక్కల కిరీటంరూపంతోనూ గాలిలో తేలిపోతూ మరో మూడు రోజుల కల్లా దుష్టపాలుడి రాజ్యం చేరుకున్నారు.

మేనల్లుడు తిరిగి ప్రాణంతో తన ఎదటికి వస్తున్నాడని తెలిసేసరికి దుష్టపాలుడు తన చెవులను తానే నమ్మలేకపోయాడు. అయినా, ఎంతోమెచ్చుకున్నవాడిలా వాళ్లకి ఎదురు వచ్చి, వృద్ధుడు వాళ్లవంక చూపుతూ, "వీళ్ళెవరు" అని అడిగాడు.

"నీవు నాకు ఒప్పజెప్పిన పనిని జయప్రదంగా నెరవేర్చి తిరిగి నేను బ్రతికి నీ ఎదటికి రాగలిగింది వీళ్ళ సహాయంవల్లనే. వీళ్ళు లేకపోతే నేను ఒక రాయిగా మారిపోయి వుండేవాడిని. నేను చంపిన రాకసుడితలలు ఇదుగో ఈసంచిలో వున్నై. కాని వాటివంక చూడటానికి వీలులేదు" అని చెప్పాడు ధీరవర్ముడు.

"చంపానన్నావుకదా. ఇక ఆ తలల్ని చూపరాదా, అంత ప్రమాదంఏముంది?" అన్నాడు దుష్టపాలుడు.



"చాలా ప్రమాదం జరుగుతుంది. ఇంకో ఆరునెలల వరకూ ఆ తలలకి ప్రాణం వుంటుంది. ప్రాణం వుండగా వాటివంక చూసిన వాళ్లు ఆపళంగా రాయి ఐపోతారు. నీవు అంతగా చూడదలుచుకుంటే యింకో ఆరునెలలు ఓపికపట్టు" అన్నాడు.

"దానివంక చూస్తేనే రాయి అయిపోయే లాగైతే, మరి నువ్వు ఆ రాక్షసుడిని చంపి తలలు ఎట్లా తేగలిగావు? నీదంతా చూడ బోతే దొంగవేషంలావుంది. ఏమైనాసరే ఆ తలలని చూడవలసిందే" అని పట్టుబట్టారు మంత్రులు. రాజు కూడా "నిజం. నిజం. తలలని చూపి తీరవలసిందే. లేకపోతే మళ్లీ వెళ్లిపోవలసిందే" అన్నాడు.

వృద్ధుడూ, వృద్ధుడి మేనకోడలుకూడా రాజుకి ఎన్నోవిధాల చెప్పి చూశారు. "ఎందుకు అనవసరంగా పట్టుబట్టుకు కూర్చుంటారు? ఏ నిమిషాన ఆ తలలవంక మీరు చూస్తే ఆ నిమిషాన మీరందరూ ఒక్కసారిగా రాళ్లు అయికూచుంటారు" అని ఎంతో నచ్చచెప్పారు.

వీలులేదన్నారు మంత్రులు. రాజు అంతే అన్నాడు. "సరే మీ కర్మం. మేము చెప్ప వలసిందంతా చెప్పాం. వినకపోతే మేమేం

చేస్తాం" అంటూ వృద్ధుడు మళ్లీ ధీరవర్ముడి నెత్తినా, తన మేనకోడలినెత్తినా మాయ కిరీటాలు వుంచాడు. వాళ్లు మాయమై పోయి, ఆచోట గాలిలో రెండు కిరీటాలు మాత్రం నిలిచినై.

ఇది చూచేసరికి దర్బారులో వున్నవాళ్లంతా ఆశ్చర్యపోయారు. అప్పుడు వృద్ధుడు అన్నాడు "ఆఖరిసారిగా నేనుచెబుతున్నాను. ఈ తలలని చూచితీరాలని మొండిపట్టు పవలండి. కాదు కూడదంటే మరొక క్షణంలో మీరు నిలుచున్నచోట్ల మీబదులు రాతివిగ్రహాలు మిగులుతై."

ఇంత చెప్పినా వాళ్లకి నమ్మకం కలగలేదు. వాళ్లు ముగ్గురూ చేరి తమని మోసం చేస్తున్నారని అనుకున్నారు. "రాళ్ళుగా మారిపోయినాసరే ఆ తలలని చూచితీరాలిసిందే" అన్నారు అందరూ ఒక్కసారి.

ఇక చెప్పి లాభంలేదని తెలుసుకున్నాడు వృద్ధుడు. సంచిని అక్కడ నేలమీదవుంచి ధీరవర్ముడితో చెప్పాడు—"నేను బయటికి పోతున్నాను. ఇదివరకు నే చెప్పిన సంగతులన్నీ జ్ఞాపకం వుంచుకుని సంచీమూతి విప్పు. వాళ్ళు చూసిన తర్వాత మళ్లీ దానిని సంచీలో బిగించి నన్ను కకవెయ్యి. వస్తాను" అని. సరే నన్నాడు ధీరవర్ముడు. వృద్ధుడు సంచిని అక్కడ వదిలి సింహద్వారం దగ్గిరికిపోయి వీధివైపుకు చూస్తూనుంచున్నాడు.

"మామా, సెలవు" అంటూ ధీరవర్ముడు తన డాలులో సంచిని చూస్తూ మూతి విప్పాడు. మూతి విప్పీ విప్పటంతోటే దాంట్లోంచి రాక్షసుడితలలుఎగిరి నేలమీద పడినై. వెంటనే దర్బారులో వున్నవాళ్ళు ఎక్కడివాళ్లక్కడ రాతివిగ్రహాలైపోయారు.

ఆ తర్వాత, ధీరవర్ముడు తల్లిని కలుసుకుని అంతా చెప్పాడు. ఆమె చాలా సంతోషించింది. వృద్ధుడి మేనకోడలు ధవళకుమారిని యిచ్చి తన కొడుక్కు పెళ్లి చేసింది. ప్రజలంతా సంతోషించారు కొత్తరాజునుచూసి. [అయిపోయింది]

